అసంపూర్తిగా 'డబుల్' ఇళ్లు

- మధ్యలోనే ఆగిన నిర్మాణాలు
- కోట్ల రూపాయల ప్రజాధనం వృథా


అనంతారంలో ఆగిపోయిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం

తిరుమలగిరి : అర్హులైన పేదలకు సొంత ఇంటి కలను నెరవేర్చాలనే లక్ష్యంతో గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా తిరుమలగిరి మండలంలోని అనంతారం, వెలిశాల గ్రామాల్లో ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అయితే అనంతారంలో మాత్రమే 60 ఇళ్ల నిర్మాణానికి పనులు ప్రారంభమయ్యాయి. కానీ పనులను పిల్లర్లు, స్లాబ్‌ల దశలోనే వదిలేశారు. బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయలేదు. సంవత్సరాలు గడుస్తున్నా పనులు పూర్తిచేయకపోవడంతో కట్టిన సగం ఇళ్ల నిర్మాణాలు కూడా శిథిలావస్థకు చేరాయి. ప్రస్తుతం ఇళ్ల పిల్లర్లు, కొన్ని చోట్ల స్లాబులు పెచ్చులూడిపోతున్నాయి. పగుళ్లు వచ్చి ఇనుప చువ్వలన్నీ బయటకు వచ్చాయి. ఇళ్ల చుట్టూ పిచ్చి మొక్కలు మొలిచాయి.

ప్రజా ధనం దుర్వినియోగం..

అసంపూర్తిగా నిర్మించి వదిలేసిన ఇళ్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. కొద్ది మందికి తాగడానికి, ఇతర కార్యక్రమాలకు అడ్డాగా మారుతున్నాయి. కొద్ది మంది రైతులు పశువులు, జీవాలను ఇందులోనే తోలి పోతున్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తి కాకపోవడంతో కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని, నిర్మాణాలు పూర్తి చేసి అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్లు అందివ్వాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం ఉచితంగా ఇళ్లు ఇవ్వాలి. అనంతారంలో మధ్యలోనే ఆగిపోయిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలి. అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించాలి. గత పది సంవత్సరాలుగా మండలంలో ఏ ఒక్కరికీ ఇల్లు అందలేదు.

- కడెం లింగయ్య, సీపీఎం నాయకుడు, తిరుమలగిరి

ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నా

కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత ఇందిరమ్మ ఇంటి పథకం కోసం దరఖాస్తు చేసుకున్నా. ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయం చేస్తే సొంత ప్రదేశంలో ఇంటి నిర్మాణం చేసుకుంటా. ఈ పథకంతో నిరుపేదలకు ఎంతో మేలు జరుగుతుంది.

- నగేష్, అనంతారం

రాష్ట్రంలో బీఆర్‌ఎస్ కనుమరుగు

- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

తిరుమలగిరి : పార్లమెంటు ఎన్నికల్లో కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీని, పార్టీ నాయకులను అంగట్లో బీజేపీకి అమ్మాడని, రాష్ట్రంలో బీఆర్ఎస్ కనుమరుగు అయ్యిందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తుంగతుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని తెలిపారు. నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి గతంలో ఎన్నడూ లేని విధంగా అసెంబ్లీ ఎన్నికల్లో 51,094ఓట్లు, పార్లమెంటు ఎన్నికల్లో 63,409 ఓట్ల రికార్డు మెజార్టీ వచ్చిందని అన్నారు. పార్టీ గెలుపునకు కృషి చేసిన నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 6 గ్యారంటీ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తుందని అన్నారు. త్వరలో జరిగే పంచాయతీ, సింగిల్‌విండో, మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కార్యకర్తలంతా కష్టపడి పని చేయాలని కోరారు. త్వరలోనే తిరుమలగిరిలో జూనియర్ కళాశాలను ప్రారంభిస్తామని తెలిపారు. నియోజకవర్గంలో రోడ్లన్నీ అధ్వానంగా ఉన్నాయని, అన్ని తండాలకు, అన్ని గ్రామాలకు బీటీ రోడ్డు సౌకర్యం కల్పిస్తానని అన్నారు. ఈ సమావేశంలో తిరుమలగిరి, మోత్కూరు మున్సిపల్ చైర్‌పర్సన్‌లు శాగంటి అనసూయరాములు, గుర్రం కవిత, పాలకుర్తి రాజయ్య, పాలెపు చంద్రశేఖర్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు కందుకూరి అంబేద్కర్, పార్టీ మండల అధ్యక్షుడు లింగయ్య, సుధాకర్, సుంకరి జనార్దన్, పేరాల వీరేష్, జమ్మిలాల్, రాపాక సోమేష్, నర్సింహారెడ్డి, వీరమల్లు, పేరాల వీరేష్, కందుకూరి లక్ష్మయ్య, ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములు వేలం

నాగారం : నాగారం మండల పరిధిలోని ఫణిగిరి గ్రామంలో ఉన్న శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ భూములను 2024–25 సంవత్సరానికి గాను ఆలయ కమిటీ చైర్మన్ గట్టు లక్ష్మీకాంత్, దేవాదాయ శాఖ ఈఓ వై.శ్రీనివాస్‌రెడ్డిల ఆధ్వర్యంలో శుక్రవారం బహిరంగ వేలం పాట నిర్వహించారు. మొత్తం 105 ఎకరాల భూమికి గాను 77 ఎకరాలకు రైతులు వేలంలో పాల్గొనగా రూ.6లక్షల ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటలక్ష్మి, ఆలయ కమిటీ డైరెక్టర్లు, సభ్యులు, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుంటకండ్ల సావిత్రమ్మకు నివాళి


సావిత్రమ్మ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి, కుటుంబ సభ్యులు

నాగారం : మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి మాతృమూర్తి గుంటకండ్ల సావిత్రమ్మ 10వ వర్ధంతిని శుక్రవారం మండల కేంద్రంలోని నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి సావిత్రమ్మ సమాధి వద్ద పుష్పగుచ్ఛాలతో శ్రద్ధాంజలి ఘటించించారు. సావిత్రమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గుంటకండ్ల రామచంద్రారెడ్డి, ఎంపీపీ కూరం మణివెంకన్న, బీఆర్ఎస్ నాయకులు చిప్పలపల్లి సోమయ్య, ఎల్క సైదులు, అనంతుల సత్తయ్య, చిప్పలపల్లి మల్లేష్, చిరంజీవి, శివ తదితరులు పాల్గొన్నారు.

కళాకారుడు సుధాకర్ మృతికి సంతాపం

అర్వపల్లి : తెలంగాణ ఉద్యమకారుడు, సాంస్కృతిక సారధి కళాకారుడు చిప్పలపల్లి సుధాకర్(డప్పు సుధాకర్) అకాల మృతికి తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారుల సంఘం జిల్లా నాయకుడు మేడిపల్లి వేణు శుక్రవారం సంతాపం తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తన ఆటా–పాటలతో ప్రజలను చైతన్యం చేశారని చెప్పారు. సుధాకర్ మృతి కళారంగానికి తీరని లోటని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మోత్కూరు : మండల పరిధిలోని అనాజిపురం గ్రామంలోని 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ హుస్సేన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనాజిపురం సబ్ స్టేషన్ పరిధిలోని అనాజిపురంతో పాటు దాచారం, పొడిచేడు, బుజిలాపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ


పసునూర్‌లో కట్ల భిక్షం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సామేల్

నాగారం : మండల పరిధిలోని పసునూర్ గ్రామానికి చెందిన కట్ల భిక్షం, నల్లగంటి లక్ష్మయ్యలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ శుక్రవారం మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడు కట్ల భిక్షం కుటుంబ సభ్యులకు రూ.5,000 ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య, ఎంపీటీసీ ఏగూరి మంజుల, పంది శ్రీను, పొదిల నరేష్, భరత్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల రైతులను ఆదుకోవాలి

నడిగూడెం : ఇటీవల కురిసిన వర్షాలు, భారీ ఈదురుగాలులకు నష్టపోయిన పండ్ల తోటల రైతులను ఆదుకోవాలని రైతు సంఘం సీనియర్ నాయకుడు ఏనుగుల వీరాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన రామాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ఐదు సంవత్సరాలుగా పంట చేతికొచ్చే దశలో ఈదురుగాలులకు మామిడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. క్షేత్ర స్థాయిలో మామిడి తోటలను పరిశీలించి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ఆయన కోరారు.

ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

హుజూర్‌నగర్ : మిషన్ భగీరథ నీటి సరఫరాపై ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలని మాస్టర్ ట్రైనర్ టి.లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లో పంచాయతీ రాజ్ అధికారులు, సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లకు మిషన్ భగీరథ నీటి సరఫరాపై నిర్వహించే ఇంటింటి సర్వేకు సంబంధించి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో అజీజ్, వెంకటేశ్వరరావు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ట్రైనర్ లక్ష్మీనారాయణ

కొరవడిన పర్యవేక్షణ.. దగ్ధమవుతున్న మొక్కలు


మాచనపల్లిలో దగ్ధమైన హరితహారం మొక్కలు

నూతనకల్ : రాష్ట్రాన్ని పచ్చదనంగా మార్చడం కోసం లక్షలు వెచ్చించి మొక్కలు నాటినప్పటికీ అధికారుల పర్యవేక్షణ, ప్రజలకు అవగాహన లోపంతో హరితహారం మొక్కలు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. మండల పరిధిలోని నూతనకల్–మాచనపల్లి గ్రామాల మధ్య ఉన్న ప్రధాన రహదారిపై వివిధ దశల్లో నాటిన హరితహారం మొక్కలకు మాచనపల్లి శివారులో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. దీంతో సుమారు 30మొక్కలు అగ్నికి ఆహుతి అయ్యాయి. మొక్కలను సంరక్షించి భావితరాలకు ఉపయోగపడేలా చూడాల్సిన అధికారుల పర్యవేక్షణ లేకుండాపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి హరితహారం మొక్కల సంరక్షణకు కృషి చేయాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు


మద్దిరాలలో ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేస్తున్న సీఐ శ్రీనివాస్ నాయక్, ఎస్ఐ మధునాయుడు


అర్వపల్లి : దుకాణంలో విత్తనాల ప్యాకెట్లను పరిశీలిస్తున్న ఏఈఓ సత్యం

మద్దిరాల : రైతులను మోసం చేసి నకిలీ విత్తనాలను విక్రయిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని సీఐ శ్రీనివాస్ నాయక్ అన్నారు. ఎస్పీ రాహుల్ హెగ్డే ఆదేశానుసారం శుక్రవారం మండల కేంద్రంలోని అన్నమయ్య ఫర్టిలైజర్ అండ్ పెస్టిసైడ్స్ షాపును తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని సూచించారు. ఎరువుల స్టాక్ వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని అన్నారు. విత్తనాలు, ఎరువులు తీసుకున్న రైతులకు వెంటనే రశీదులు అందజేయాలని సూచించారు. ఆయన వెంట ఎస్ఐ పసుపులేటి మధునాయుడు, ఫర్టిలైజర్ షాపు యజమానులు తదితరులు ఉన్నారు.

అడివెంల క్రాస్ రోడ్డు వద్ద..

అర్వపల్లి : మండల పరిధిలోని అడివెంల క్రాస్‌రోడ్డు వద్ద విత్తనాల విక్రయ దుకాణాలను వ్యవసాయ శాఖ తిమ్మాపురం క్లస్టర్ విస్తరణ అధికారి నేరెళ్ల సత్యం శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విత్తనాల ప్యాకెట్లను పరిశీలించారు. నకిలీ విత్తనాలను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు తప్పని సరిగా రశీదులు ఇవ్వాలని వ్యాపారులకు సూచించారు. కార్యక్రమంలో దుకాణాల యజమానులు రాజశేఖర్, లింగరాజు, జానయ్య, సందీప్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

చివ్వెంల : గ్రామాల్లో తాగునీటి సమస్యపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీఓ సంతోష్ కుమార్ అన్నారు. మిషన్ భగీరథ వాటర్ సరఫరాపై శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో చివ్వెంల, మోతె, ఆత్మకూర్(ఎస్), పెన్‌పహాడ్ మండలాల పంచాయతీ కార్యదర్శులు, భగీరథ సిబ్బంది, ఆశా వర్కర్లకు నిర్వహించిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. ఆయా మండలాల్లోని గ్రామాల్లో వాటర్ సరఫరాకు సంబంధించి ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్‌లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఇప్పటికీ నల్లా కనెక్షన్ ఇవ్వని వారి వివరాలు పొందుపర్చాలని అన్నారు. పైపులైన్ లీకేజీ, నీటి సరఫరాలో అంతరాయం వంటి విషయాలు ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల ఎంపీడీఓలు జె. వెంకటేశ్వర్లు, హరిసింగ్, ఆయా మండలాల పంచాయతీ కార్యదర్శులు, ఆశావర్కర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి


అర్వపల్లి : పర్సాయపల్లిలో బడిబాట ర్యాలీ


మద్దిరాలలో..

తిరుమలగిరి : బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని వెలిశాల జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశోక్‌రెడ్డి కోరారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గ్రామంలో ఇంటింటికీ తిరిగి విద్యార్థులను పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య, గుణాత్మకమైన విద్య అందుతుందని తెలిపారు. ప్రభుత్వం ప్రతి విద్యార్థికి రెండు జతల ఉచిత యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, మధ్యాహ్న భోజనం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.సోమయ్య, ఉపాధ్యాయులు జి.శ్రవణ్‌కుమార్, మల్లయ్య, రామాంజనేయులు, దస్తగిరి, సంతోష్‌కుమార్, ఎల్లమ్మ, అనితాకుమారి, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు వీరమ్మ, యాకూబ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

అర్వపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని తిమ్మాపురం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వర్దెల్లి కృష్ణయ్య అన్నారు. తిమ్మాపురం జెడ్పీహెచ్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిధిలోని సూర్యనాయక్‌తండా, కోమటిపల్లి, గన్నెనాయక్‌తండా తదితర గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అలాగే పర్సాయపల్లిలో జెడ్పీహెచ్ఎస్ ఆధ్వర్యంలో గ్రామంలో బడిబాట ర్యాలీ నిర్వహించి ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం వీరస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చివ్వెంల : మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని ఆయా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహిస్తూ తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి గోపాల్‌రావు, హెచ్ఎంలు శిగ వీరస్వామి, కస్తూరి శ్రీనివాస్, అల్లి నాగయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్) : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన ఎందరో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నారని పలువురు ఉపాధ్యాయులు అన్నారు. శుక్రవారం మండల వ్యాప్తంగా రెండవ రోజు బడిబాట కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. పేద, మధ్యతరగతి వారు ప్రైవేటు పాఠశాలల మోజులో పడి అప్పుల పాలు కావొద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ప్రధానోపాధ్యాయుడు మేకల రాజశేఖర్ అన్నారు. శుక్రవారం చీదెళ్ల ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా సౌకర్యాలు ఉన్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అడ్డి సరిత, రాములు, అంగన్‌వాడీ టీచర్లు ఉమ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : బడిఈడు పిల్లలందరిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రధానోపాధ్యాయుడు ధరావత్ వెంకన్న అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మంచి విద్యను అందిస్తున్నాయని అన్నారు. ఎంతో ప్రతిభావంతులైన ఉపాధ్యాయులతో విద్యార్థులకు విద్యా బోధన అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమావత్ రమేష్, వెంకటేశ్వర్లు, సీఆర్పీ శ్రీనివాస్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రధానోపాధ్యాయుడు పరమేష్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొత్తగూడెం ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన బడి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్నిరకాల సౌకర్యాలు, మౌలిక వసతులను ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు పర్వీన, ఆయాలు పుష్ప, యలేంద్ర, గ్రామస్తులు మల్లయ్య, రమేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


పెన్‌పహాడ్ : చీదెళ్లలో..


తుంగతుర్తి : కొత్తగూడెంలో..


తిరుమలగిరి : వెలిశాలలో బడిబాట..


చివ్వెంల : రాజుతండాలో..


ఆత్మకూరులో..

భువనగిరి ఎంపీని కలిసిన నాయకులు


అర్వపల్లి : ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బోయలపల్లి రేఖ


తిరుమలగిరి : హైదరాబాద్‌లో ఎంపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పాస్టర్లు

అర్వపల్లి : భువనగిరి పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికైన చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని మండల పరిధిలోని అడివెంల గ్రామానికి చెందిన జాతీయ స్థాయి టెన్నిస్ క్రీడాకారిణి, రేఖ చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ బోయలపల్లి రేఖ, మాజీ సర్పంచ్ మద్ది పద్మలు శుక్రవారం హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా రేఖ మాట్లాడారు. తమ గ్రామం నుంచే కిరణ్‌కుమార్‌రెడ్డి ఎంపీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారని తెలిపారు. ఎంపీగా గెలిచినందున మొట్టమొదటగా తమ గ్రామానికే రావాలని ఆహ్వానించినట్లు చెప్పారు. గ్రామంలోని ముత్యాలమ్మ ఆలయంలో కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేసి విజయోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

ఎంపీ కిరణ్‌కుమార్ రెడ్డిని కలిసిన పాస్టర్లు

తిరుమలగిరి : భువనగిరి పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికైన చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని శుక్రవారం హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో తుంగతుర్తి నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా ఎంపీకి శుభాకాంక్షలు తెలిపారు. శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు బి.పి.డానియల్, అధ్యక్షుడు మందుల బాబురావు, కార్యదర్శి రమేష్, గౌరవ సలహాదారులు వేముల హనోగ్, చైర్మన్ చంద్రశేఖర్, స్వామిదాస్, జయరాజ్, సామియల్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : భువనగిరి పార్లమెంట్ లోక్‌సభ సభ్యుడు చామల కిరణ్ కుమార్‌రెడ్డిని శుక్రవారం మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాలతో సన్మానించారు. ఎంపీని కలిసిన వారిలో పెద్దబోయిన అజయ్‌కుమార్, కటకం వెంకన్న, బత్తుల జలంధర్, రాములు తదితరులు ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ గ్రామశాఖ అధ్యక్షుడిగా పిడమర్తి వీరబాబు

హుజూర్‌నగర్‌రూరల్ : ఎమ్మార్పీఎస్ గోపాలపురం గ్రామ శాఖ అధ్యక్షుడిగా పిడమర్తి వీరబాబు నియమితులయ్యారు. శుక్రవారం గోపాలపురం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మార్పీఎస్ హుజూర్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు పెద్దపంగు కాటమయ్య.. వీరబాబుకు నియామకపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఎల్లేష్, ప్రభు, వెంకటేశ్వర్లు, శ్రీను, రాజేష్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు ఉంటేనే అనుమతి


మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలో 300 చదరపు గజాల భూమి ఉంటే తప్పనిసరిగా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలని, ఇంకుడు గుంత ఉంటేనే మున్సిపాలిటీలో భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలను పరిశీలించి మాట్లాడారు. ఇంకుడు గుంతలను నిర్మించుకోని వారికి ఇప్పటికే రెడ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఆయన వెంట మున్సిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ తదితరులున్నారు.

అధిక ఫీజులను నియంత్రించాలి

మిర్యాలగూడ టౌన్ : ప్రైవేట్ విద్యా సంస్థల్లో అధిక ఫీజులను నియంత్రించాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు పోగుల సైదులు అన్నారు. శుక్రవారం మిర్యాలగూడలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రైవేట్ విద్యా సంస్థలో అక్రమ వసూళ్లను అరికట్టడంలో విద్యాశాఖ పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. పలు ప్రైవేటు విద్యా సంస్థల్లో ఇప్పటికే బెల్టులు, టైలు, పుస్తకాలు, షూ విక్రయాలకు పెద్ద మొత్తంలో వసూలు చేస్తున్నారని అన్నారు. దీంతో పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో 10శాతం పేదలకు ఉచిత విద్యను అందించాలని కోరారు. గుర్తింపులేని పాఠశాలలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు కొండ జోష్ గౌడ్, రెడ్డిమల్ల నాగరాజు, సైదులు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హరితహారానికి సిద్ధంగా మొక్కలు


తిమ్మాపురం గ్రామంలోని నర్సరీలో ఏపుగా పెరుగుతున్న మొక్కలు


కుంచమర్తిలో..


కొమ్మాలలో..

అర్వపల్లి : పదవ విడత తెలంగాణ హరితహారానికి వన నర్సరీల్లో మొక్కలు రెడీగా ఉన్నాయి. మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో ఈ విడతలో 1.70 లక్షల మొక్కలను పెంచుతున్నారు. గ్రామ పంచాయతీకి సుమారు రూ. 10 వేల చొప్పున మొక్కలను పెంచుతున్నట్లు ఉపాధిహామీ పథకం ఏపీఓ ఉపేందర్ తెలిపారు. పండ్లు, పూలు, నీడనిచ్చే మొక్కలను పెంచుతున్నారు. ప్రస్తుతం మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. వర్షాలు సమృద్ధిగా కురియగానే మొక్కలను పలు ప్రదేశాలలో నాటనున్నారు.

బూరుగడ్డ ఆలయంలో కుంకుమార్చన


కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలోని శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం సహస్రనామ కుంకుమార్చన నిర్వహించారు. ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, మంగళశాసనం, సహస్రనామ కుంకుమార్చనలు, స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకం, శ్రీగోదాదేవికి ప్రత్యేక పూజలు జరిపారు. అష్టోత్తర శతనామావళి, అలంకరణ, గోపూజ, అనంతరం ఆరగింపు, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.